క్లుప్తంగా

వన్‌స్టాప్ సెంటర్ తనిఖీ



వివరాలు అడిగి తెలుసుకుంటున్న మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియాబేగం

కర్నూలు(హాస్పిటల్): జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికార కేంద్రం ఆధ్వర్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిర్వహిస్తున్న వన్‌స్టాప్ సెంటర్‌ను శనివారం ఏపీ ఉమెన్ కమిషన్ సభ్యురాలు డాక్టర్ రుఖియాబేగం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి అక్కడ ఉన్న బాధితులతో మాట్లాడారు. అనంతరం ఐసీపీఎస్‌ను సందర్శించి బాల్య వివాహాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట అర్బన్ సీడీపీఓ అనురాధ, ఎమ్మిగనూరు సీడీపీఓ సఫారున్నీసా, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ స్వర్ణలత ఉన్నారు.

జాతీయ సైక్లింగ్ పోటీలకు కర్నూలు విద్యార్థిని



విద్యార్థిని వెంకటేశ్వరి

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు కర్నూలు విద్యార్థిని ఎంపికైంది. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరీ పట్టణంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ప్యాపిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ఎం.వెంకటేశ్వరీ ఎంపికైంది. గత నెల 30న గుంటూరు జిల్లాలో నిర్వహించిన అంతర్ జిల్లాల సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికైందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు విజయలక్ష్మి శనివారం వెల్లడించారు.

వైఎంసీఏ గ్రౌండ్స్‌లో క్రిస్మస్ పాటల ఆరాధన



వైఎంసీఏ గ్రౌండ్స్‌లో క్రిస్మస్ నాటిక ప్రదర్శిస్తున్న చిన్నారులు

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక ఆర్ఎస్ రోడ్డులో ఉన్న వైఎంసీఏ మైదానంలో లేమన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి క్రిస్మస్ పాటల ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చిన్నారులు క్రీస్తు జననంపై ప్రత్యేకంగా పాటలు, నాటికలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా చెన్నైకు చెందిన క్రిస్మస్ వర్తమానికులు బ్రదర్ సురేష్ మార్కస్ మాట్లాడుతూ క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చిలకు వెళ్లడం కాకుండా ప్రతి వారం దేవుని ఆరాధించాలన్నారు. పండుగ క్రైస్తవులుగా కాకుండా ఆధ్యాత్మికంగా దేవుని సన్నిధిలో జీవించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంఘ కాపారి దత్తుబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలి



ఉపాధి పనులపై ఎంపీడీఓ, ఏపీఓతో చర్చిస్తున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

కోడుమూరు రూరల్: మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం కోడుమూరులోని ఉపాధి కార్యాలయాన్ని పీడీ వెంకటరమణయ్య తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల తీరుపై ఎంపీడీఓ రాముడు, ఏపీఓ మోదీన్‌బాషాతో చర్చించారు. ప్రస్తుతం ఎంతమంది కూలీలు వస్తున్నారు, ఎక్కడెక్కడ పనులు చేస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. అలాగే ఉపాధి పథకం కింద నిర్మిస్తున్న మినీ గోకులాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి కూలీలకు 6రోజుల పనికి 6రోజుల వేతనం వచ్చేలా పని ప్రదేశంలో మార్కింగ్ ఇచ్చి పనులు చేయించాలని ఏపీఓను పీడీ ఆదేశించారు. ఈ ఏడాది ఇచ్చిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పీడీ సిబ్బందిని హెచ్చరించారు.

పచ్చి మిర్చి ధర పతనం

కర్నూలు(అగ్రికల్చర్): మిర్చి రైతు పరిస్థితి దయనీయంగా మారింది. రబీలో సాగు చేసిన పచ్చి మిర్చి కొద్ది రోజులుగా మార్కెట్‌లోకి వస్తోంది. శనివారం పచ్చి మిర్చి ధరలు మరింత పడిపోవడంతో రైతుల ఆందోళన అంతా.. ఇంతా కాదు. పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటం పచ్చి మిర్చికి లభించిన ధర రూ.700 మాత్రమే. తెంపడం, రవాణా చార్జీలకు కూడ ఈధర గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు లభిస్తున్న ధర ఇంత అధ్వానంగా ఉంటే రిటైల్ మార్కెట్‌లో కిలో పచ్చి మిర్చి ధర రూ.32 వరకు ఉంటోంది. అంటే పండించిన రైతు నష్టాలు మూట కట్టుకుంటుండగా... దళారీలు మాత్రం సొమ్ము చేసుకుంటున్నారు.

తూతూ మంత్రంగా 'పేరెంట్స్, టీచర్స్ మీట్'

- నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనంపై చర్చల్లేవు
- పేరెంట్స్ సలహాలు నామమాత్రమే



టగ్ ఆఫ్ వార్‌ను తిలకిస్తున్నక లెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు సిటీ: ‘పేరెంట్స్, టీచర్స్ మీట్’ తూతూమంత్రంగా సాగింది. విద్యాభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం, విద్యా సంస్కరణలను పరిశీలించి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వం, పాఠశాల మధ్య సంబంధాలను బలపరిచేందుకు శనివారం చేపట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ అన్ని స్కూళ్లలోనూ సాదాసీదాగా నిర్వహించారు. విద్యార్థుల తల్లులకు ముగ్గులు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించడం తప్ప నాణ్యమైన బోధన, భోజనం నిర్వహణపై చర్చలు జరిగిన దాఖలాలు లేవు. పేరెంట్స్ నుంచి సలహాలు తీసుకున్నదీ లేదు. విద్యార్థుల ప్రగతి పత్రాలను ఆయా తరగతుల టీచర్లు విద్యార్థులు తల్లిదండ్రులకు అందించి వారితో సంతకాలు పెట్టించుకుని పంపించేశారు.

- టౌన్ మోడల్ స్కూల్‌లోని సమావేశంలో మున్సిపల్ అదనపు కమిషనర్ ఆర్.జీ.వి క్రిష్ణ పాల్గొని వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.
- ఎస్‌ఏపీ క్యాంపులోని కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ హైస్కూల్, దామోదరం సంజీవయ్య స్మారక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో జరిగిన సమావేశాలకు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక హాజరయ్యారు.
- ప్రకాష్ నగర్‌లోని టంగుటూరి ప్రకాశం పంతులు స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సంబంధాలు మెరుగుపడాలి

కర్నూలు(సెంట్రల్): ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సంబంధాలు మెరుగుపడాలని కలెక్టర్‌పి.రంజిత్ బాషా అన్నారు. కంట్రోల్ రూమ్ సమీపంలోని డాక్టర్ అబ్దుల్ కలాం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో వికాసం, విద్యానైపుణ్యాలను పెంపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లకు సంకల్పించినట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పోటీ పరీక్షలకు లెక్కలలో అధిక మార్కులు సాధించే మెలకువలను వివరించారు. డీఈఓ శామ్యూల్‌పాల్ మాట్లాడుతూ మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌లు పండుగ వాతావరణంలో కొనసాగాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్‌పర్సన్ గౌసియా, రెండో పట్టణ సీఐ సృజన్‌కుమార్ పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల టగ్ ఆఫ్ వార్, తల్లుల రంగోలి పోటీల్లో పాల్గొనగా కలెక్టర్ తిలకించారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సహపంక్తి భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు శనివారం కల్లూరు మండలం అశ్వత్థపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ చంద్రశేఖర్, హెచ్ఎం కీర్తి, గ్రామ పెద్దలు ఈదురుబాషా, అన్వర్ బాషా, మౌలాలి పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: స్థానిక బీ క్యాంపు విజ్ఞాన్ మందిర్ సబ్ స్టేషన్ పరిధిలోని కాలనీలలో ఆదివారం విద్యుత్ కోతలు ఉంటాయని ఈఈ శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ శాఖ లైన్ల మరమ్మతులు, అభివృద్ధి పనుల్లో భాగంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు, రేపు సీపీఎం ఓల్డ్‌సిటీ నగర మహా సభలు

కర్నూలు(సెంట్రల్): సీపీఎం ఓల్డ్‌సిటీ నగర కమిటీ 20వ మహా సభలను ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నట్లు పార్టీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న సాయంత్రం జమ్మిచెట్టు వద్ద బహిరంగసభ, 9న ప్రతినిధుల సభలు ఉంటాయన్నారు.

మీడియేషన్‌పై సెన్సిటైజేషన్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి పి.పాండురంగారెడ్డి

కర్నూలు (లీగల్): ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి కర్నూలు బార్ అసోసియేషన్‌లో సెన్సిటైజేషన్ ప్రోగ్రాం ఆన్ మీడియేషన్ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా 6వ అదనపు జిల్లా జడ్జి పి.పాండురంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియేషన్ వల్ల కలిగే లాభాలు, మీడియేషన్‌ను ఉపయోగించి కేసులు ఎలా త్వరితగతిన పరిష్కరించాలో న్యాయవాదులకు వివరించారు. న్యాయవాదులు తమ కక్షిదారులను మధ్యవర్తిత్వం దిశగా ఒప్పించేందుకు కృషి చేయాలన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న వీలైనన్ని ఎక్కువ కేసులు మీడియేషన్ దిశగా పరిష్కరించుకునేలా కృషి చేయాలని సూచించారు. మీడియేషన్ రూల్స్, రెగ్యులేషన్స్, యాక్ట్ గురించి న్యాయవాదులకు వివరించారు. సదస్సులో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.కృష్ణమూర్తి, బార్ సెక్రటరీ రవికాంత్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ నూతన శాఖ ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్): ఏఐవైఎఫ్ టీజీ నగర్ నూతన శాఖను ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం ఆ శాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసులు, కారుమంచి ఆధ్వర్యంలో యువకులు సమావేశమై నూతన శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా నవీన్‌కుమార్, అఖిలలు వ్యవహరిస్తారు. త్వరలోనే శాఖ కార్యవర్గాన్ని విస్తరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బాబయ్య పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు: కర్నూలు రైల్వే స్టేషన్ శివారులోని తుంగభద్ర బ్రిడ్జిపై రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి నదిలోని నీటిలోకి పడిపోయాడు. గుంటూరు నుంచి కాచిగూడకు వెళ్లే ట్రైన్ ఢీకొనగా నీళ్లలో పడిపోయినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు శనివారం క ర్నూలు రైల్వే పీఎస్ ఎస్ఐ కిరణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచాడు. సుమారు 5.5 అడుగుల ఎత్తు ఉండి 40 సంవత్సరాల వయస్సు ఉంటుంది. నీటిలో మునిగిపోవడం వల్ల ముఖం, శరీరం మొత్తం ఉబ్బిపోయి గుర్తు పట్టని విధంగా ఉంది. ఎరుపు రంగు పాలిస్టర్ ఫుల్ షర్టు, నలుపు, ఎరుపు రంగు గల నైట్ ప్యాంటు ధరించాడు. ఆచూకీ తెలిసినవారు 94406 27654 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కిరణ్ కుమార్ కోరారు.

వ్యక్తి అదృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని క్రాంతినగర్ కాలనీకి చెందిన పరమేష్(38) రెండు నెలల నుంచి కనిపించడంలేదని భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. ఇంటికి అప్పుడప్పుడు వస్తూ వెళ్తుండేవాడని, అయితే రెండు నెలల నుంచి రాకపోవడంతో బంధువుల ఇళ్లల్లోనూ, తెలిసిన వారివద్ద వెతికినా కనిపించకపోవంతో అనుమానం వచ్చి శనివారం భార్య ఫిర్యాదు చేసిందని చెప్పారు.

యూపీహెచ్‌సీ ఆర్‌డీ తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డీ డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని ఎన్‌టీఆర్ కాలనీలో ఉన్న యూపీహెచ్‌సీని రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ (ఆర్‌డీ ఎం అండ్ హెచ్) డాక్టర్ బి. రామగిడ్డయ్య శనివారం తనిఖీ చేశారు. ఓపీ, ల్యాబ్, వ్యాధి నిరోధక టీకాలు, మందుల గది, రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి గురించి సమీక్ష నిర్వహించారు. ఓపీ కోసం వచ్చిన వారికి ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ ద్వారా అభా ఐడీ జనరేట్ చేసి వ్యాధినిర్ధారణ పరీక్షలు నిర్వహించి, తగిన చికిత్స అందించాలని, ఆ వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, సరిపడా కిట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం అసంక్రమిత వ్యాధుల సర్వే, పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సర్వే, మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాల్లో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ ఉమా, డీపీవో విజయరాజు, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎన్.మనోహర్ మాణిక్యం, అధ్యక్షులు ఎస్.మునెప్ప, జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం కర్నూలులో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్‌లో ఉన్న సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, కార్మికులకు జీవో నెం.549 ప్రకారం రూ.16వేలు ఇవ్వాలని, పారిశుద్ధ్యం, సెక్యూరిటీ గార్డులు, పెస్ట్ కంట్రోల్ సిబ్బందికి కనీసం వేతనం అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. చాలా ఆసుపత్రుల్లో కార్మికులకు పీఎఫ్ కూడా చెల్లించడం లేదన్నారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా సెక్యూరిటీ గార్డులను వేధిస్తున్నారని ఆరోపించారు. అందుకే ఈనెల 19న దాసరి భవన్‌లో జరిగే రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్ నిర్ణయాలు ప్రకటిస్తామన్నారు.

చౌక డిపోలపై కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు

- ఐదుగురు డీలర్లు, రైస్‌మిల్ నిర్వాహకునిపై 6ఎ కేసు

కర్నూలు: చౌక డిపోల్లో జరుగుతున్న మోసాలపై విజిలెన్స్ తనిఖీలు ముమ్మరమయ్యాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ప్రాంతీయ అధికారి చౌడేశ్వరి ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగు విజిలెన్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులతో కలసి తనిఖీలు నిర్వహించి ఐదుగురు డీలర్లు, ఒక రైస్‌మిల్లు నిర్వాహకుడిపై నిత్యవసర వస్తువుల చట్టం (6)ఎ కింద కేసు నమోదు చేశారు. కోడుమూరు మండలం లద్దగిరిలో 30వ నెంబర్ చౌక డిపో, కర్నూలు మండలం బి.తాండ్రపాడు బీసీ కాలనీలోని 2వ నెంబర్ చౌక డిపో, గూడూరు మండలం పొన్నకల్లులో 16వ నెంబర్ చౌక డిపో, కర్నూలు పాతబస్తీలోని మరో రెండు చౌక డిపోల్లో తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి భౌతిక నిల్వల్లో వ్యత్యాసాలు ఉండటంతో నిత్యవసర వస్తువుల చట్టం (6)ఎ కింద కేసు నమోదు చేశారు. అలాగే ఆత్మకూరులోని ఓ రైస్‌మిల్లులో కూడా తనిఖీ నిర్వహించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినట్లు తనిఖీల్లో తేలడంతో నిర్వాహకునిపై కూడా కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. గత రెండు రోజులుగా చౌక డిపోలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండటంతో డీలర్లు బెంబేలెత్తిపోతున్నారు. అధికారులు తనిఖీలకు వస్తున్నట్లు ముందుగానే సమాచారం చేరుతుండటంతో కొంతమంది చౌక డిపోలను మూసేసి సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సమాచారం.

ఆహార పరిశ్రమల స్థాపనకు 35 శాతం సబ్సిడీ

- ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమాదేవి

కర్నూలు(అగ్రికల్చర్): ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పీఎంఎఫ్ఎంఈ కింద 35 శాతం సబ్సిడీ లభిస్తుందని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. శనివారం స్థానిక ఉద్యాన భవన్‌లో ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుపై జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఉమాదేవి మాట్లాడారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద నూతన పరిశ్రమల స్థాపనకు అవకాశం ఉందన్నారు. ఇందుకు బ్యాంకులు రుణ సదుపాయాన్ని కల్పిస్తాయన్నారు. 18 నుంచి 55 ఏళ్లలోపువారు పరిశ్రమల స్థాపనకు అర్హులని, ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం భరించాల్సి ఉంటుందని తెలిపారు. 90 శాతం మొత్తం బ్యాంకులు రుణంగా ఇస్తాయన్నారు. ఇందులో 35 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 18 ఆహార శుద్ధి పరిశ్రమలు మంజూరయ్యాయని, మరో 25 దరఖాస్తులు బ్యాంకులకు పంపామని తెలిపారు. సదస్సులో ఎల్‌డీఎం రామచంద్రరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి, డీఆర్‌డీఏ డీపీఎం నరసమ్మ పాల్గొన్నారు.


కోర్టు కేసులపై సకాలంలో స్పందించండి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): కోర్టు కేసులపై సకాలంలో స్పందించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా తాను హాజరు కోర్టుకు కావాల్సి ఉంటుందన్నారు. ఏదైనా ఇబ్బంది కరమైన తీర్పులు ఉంటే ముందుగానే తనకు తెలియజేయాలని సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో లా ఆఫీసర్లతో కలెక్టర్ కోర్టు కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కేసులపై జాప్యం చేయరాదన్నారు. నిర్దేశించిన నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసుల పర్యవేక్షణ కోసం డివిజన్‌కు లైజన్ అధికారులను నియమించాలని డీఆర్వో, ఆర్‌డీఓలను ఆదేశించారు. కోర్టు కేసులకు హాజరు కావాలని తహసీల్దార్లకు నోటీసులు వస్తే తప్పక హాజరు కావాలన్నారు. కాగా, వచ్చే సమావేశం నుంచి కచ్చితంగా ఆదోని సబ్‌కలెక్టర్, తహసీల్దార్లు హాజరయ్యేలా చూడాలని డీఆర్వోను ఆదేశించారు. రెండు వారాలకు ఒకసారి డివిజన్ స్థాయిలో లా ఆఫీసర్ల సమావేశం నిర్వహించేందుకు ఆర్‌డీఓలు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శాఖల వారీగా ఉన్న కేసుల వివరాలను తనకు అందజేయాలని జీపీ, ఏజీపీలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా కోర్టు జీపీ ఆనందరావు, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

ఆట స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో వీసీ ఎన్‌టీకే నాయక్,రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు

కర్నూలు(సెంట్రల్): వర్సిటీలోని ఆట స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ విద్యార్థులకు సూచించారు. శనివారం విశ్వ విద్యాయం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆట స్థలాలను పరిశుభ్రం చేసి మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. వర్సిటీలో ఉన్న ఆట స్థలాలను సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ విజయకుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు పాల్గొన్నారు.

స్టీవార్డెన్‌ను పరామర్శించిన వీసీ

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పురుషుల హాస్టల్ స్టీవార్డెన్ నవీన్‌ను వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రొఫెసర్ విజయ కుమార్ నాయుడు పరామర్శించారు. శుక్రవారం ఆయన విధులు ముగించుకొని సొంతూరు గార్గేయపురానికి వెళ్తుండగా మార్గమధ్యలో ద్విచక్రవాహనంపై నుంచి కింద పడి గాయపడ్డారు. దీంతో అతన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఆయన ఆసుపత్రి ఖర్చులకు వీసీ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

వైభవంగా తిరుమలేశ్వర స్వామి ప్రభోత్సవం



భక్తుల మధ్య ఊరేగుతున్న స్వామి వారి ప్రభోత్సవం

కోసిగి: మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామ ప్రజల ఆరాధ్యదైవం శ్రీ తిరుమలేశ్వర స్వామి వారి ప్రభోత్సవం శనివారం సాయంత్రం భక్తుల మధ్య వైభవంగా సాగింది. వేకువజామున నుంచి స్వామి వారికి ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఫలపుష్పాలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేలాది మంది భక్తులు తిలకిస్తుండగా ఉత్సవమూర్తిని ప్రభలో కొలువుచేరారు. అనంతరం కలశాలు, మేళతాళాలతో ఆలయం నుంచి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథావిధిగా గమ్యస్థానానికి చేర్చారు. ఊరేగింపునకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ దొడ్డి నరసన్న, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు, బండ్ల గోవిందు, మల్లికార్జున గౌడ, రవిగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన స్థలాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



ధనలక్ష్మి నగర్‌లో పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో ఉద్యానవన స్థలాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. శనివారం స్థానిక 19వ వార్డులోని ధనలక్ష్మి నగర్, రాంప్రియ నగర్, ప్రశాంతి నగర్‌లలో పార్కులను కమిషనర్ పరిశీలించారు. పార్కుల్లో పిచ్చిమొక్కలు తొలగించాలని, గ్రావెల్, వాకింగ్ ట్రాక్ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పలు కాలనీల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగు పడాలన్నారు. ఆనంద్ థియేటర్ సమీపంలో పూర్తి కావచ్చిన డ్రైనేజీ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఏపీఎస్పీ క్యాంపు బైపాస్ రహదారి ప్రతిపాదనలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీఈఈ క్రిష్ణలత పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు (టౌన్): నగరపాలకలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నగరపాలకలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, మున్సిపల్ ఆరోగ్య శాఖ విశ్వేశ్వర రెడ్డితో కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు, 2024 అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె కాలపు వేతనాలు, యూనిఫాం, హెల్త్ అలవెన్స్, పండుగ సెలవులు, టైం స్కేల్ కార్మికుల బకాయిలు, కొబ్బెరి నూనె, ఏపీజీఐ బాండ్లు, హెల్త్ కార్డులు, ఎన్నికల భత్యం కుట్టుకూలీల డబ్బు ఇవ్వాలన్నారు. స్పందించిన కమిషనర్ త్వరలోనే కార్మికులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పులగం మద్దిలేటి, చంద్రశేఖర్, సాయినాథ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేత పచ్చర్ల జట్టు

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామంలో చెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అలంపూర్ మండలంలోని పచ్చర్ల గ్రామ జట్టు విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ పోరులో తిరుపతికి చెందిన జట్టు రన్నర్‌గా నిలిచింది. మొదటి బహుమతి రూ.30 వేలు దాత బోయ అన్వేష్ అందజేశారు. రెండో బహుమతి రూ.20 వేలు పటేల్ యాదవ్, శివ యాదవ్ అందించారు.